ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 11 | మే | 2024
పేజీలు 8

## బిజెపి, బిఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలి : కూనంనేని



-రఘురాంరెడ్డి గెలుపు కోసం విస్తృతం ప్రచారం

-ఘనస్వాగతం పలికిన మహిళలు

2లో

# బహిరంగ ప్రచారానికి చెక్

**ఇక అంతా అంతర్గతమే**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెర పడనుంది. గత నెల 28 నుంచి ఎన్నికల ప్రచారంలో భాగంగా మైకులు హోరెత్తాయి. ప్రధానంగా మూడు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలకు కూడా నేటితో తెరపడనుంది. ఇక అంతా మౌనంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే మిగిలి ఉంది. ఈ దఫా పార్లమెంటు ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎక్కడ ఏ రాజకీయ పార్టీ కూడా భారీ బహిరంగ సభలను నిర్వహించ లేదు. కాంగ్రెస్ పక్షాన జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి తో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రచార బాధ్యతలను నిర్వహించారు. బిఆర్ఎస్ తరుపున కేసిఆర్, ఖమ్మం పార్లమెంటు పరిధిలో రెండు రోజులు రోడ్డు షో నిర్వహించారు. బిజెపి తరుపున జెపి నడ్డా కొత్తగూడెంలో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం కాంగ్రెస్ అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ కొత్తగూడెం బహిరంగ సభ నిర్వహించారు. స్థానిక శాసన సభ్యులు ఎక్కువగా సభలు, సమావేశాలు ప్రధానంగార్యాలీలు,కార్నర్ మీటింగ్‌లకు, రాజకీయ పార్టీలు ప్రాధాన్యతనిచ్చాయి. పోలింగ్‌కు మరో రెండు రోజులు ఉండడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే అంశాలపై దృష్టి సారించాయి.

# అంతా అద్దె సరుకే..!

-సమన్వయ లోపంతో వాడుతున్న 'కమలం'

-జిల్లా నాయకత్వానికి లేని ప్రాధాన్యత

-అభ్యర్థిని పక్కదారి పట్టిస్తున్న 'కోటరీ'

2లో

# నాకే సానుకూలం.. గెలుపు నాదే..

-శాసన సభ ఎన్నికల తర్వాత ప్రజల ఆలోచనలో మార్పు

-విద్యుత్ కోతలు.. అందని ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి : నామ

2లో



### తండాలను పంచాయతీలుగా చేసిన..

# ఘనత కేసిఆర్‌దే..



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చి వారి గ్రామాలను వారే పాలించుకునే విధంగా వెసులు బాటు కల్పించిన ఘనత

మిగతా 2లో..

-ఇచ్చిన హామీల్లో ఒకటి సంపూర్ణంగా నెరవేర్చలేదు

-ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ

### ప్రజలకు

# సేవ చేసేందుకే రాజకీయాలు



**ప్రజాపక్షం/ మధిర :** ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని ఎంపిగా గెలిపించడం ద్వారా రాజకీయాల్లో సేవ చేసే అవకాశం కల్పించాలని ఖమ్మం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి విజ్ఞప్తి

మిగతా 2లో..

- బిజెపి, బిఆర్ఎస్‌కు ఓటేస్తే ప్రజలకు నష్టం
- అత్యధిక మెజార్టీతో గెలిపించండి కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి

# అంతా అద్దె సరుకే..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొన్ని సూచనలను పాటిస్తే అపూర్వ విజయాలు అందిస్తాయి. కొన్ని సూచనలను పాటిస్తే అధః పాతాళం చవి చూడక తప్పదు. రాజకీయాలలో ప్రత్యేకంగా నాయకులకు వెనకా ముందు కుడి భుజం, ఎడమ భుజమంటూ తిరిగే వారి సూచనలు జాగ్రత్తగా గమనించి ఆచరించాలి లేదంటే పతన సాక్షిగా మిగలక తప్పదు. ఇప్పుడు ఖమ్మం పార్లమెంటు బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్ రావు కోటరీ ఆయన సలహాదారుడు రోజు రోజుకు ఆయన ఓట్ల వాటాను దిగజారుస్తున్నాడు. మరో కోణంలో చూస్తే గతంలో ఏ బిజెపి అభ్యర్థి చేయలేనంత ప్రచారాన్ని వినోద్‌రావు చేశారు. కాని జిల్లా నాయకత్వాన్ని సమన్వయం చేసుకోవడంలో ఘోర వైఫల్యం పోలింగ్ నాటికి తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలకు వచ్చే జనమంతా అద్దె సరుకే. కూలీ ఇచ్చి సభలకు తీసుకు వస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. బిజెపి ఆనవాలు లేని గ్రామాల నుంచి కూలి ఇచ్చి సభలకు తరలిస్తున్నారన్న అపవాదును ఆ పార్టీ ముటకట్టుకుంటుంది. స్థానికంగా సంబంధాలు లేని వ్యక్తులను కోటరీగా ఏర్పాటు చేసుకోవడంతో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత లభించడం లేదు. స్థానిక నాయకత్వంతో మాట్లాడే పరిస్థితి కూడా లేదని కొందరు వాపోతున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నాటి నుంచి నానాటికి తీసికట్టు నానంబొట్టు అన్న సామేతగా తయారైంది బిజెపి పరిస్థితి. ఆటుపోట్లు ఎదుర్కొని బిజెపి నాయకులుగా, కార్యకర్తలుగా ముద్రపడిన వారు కనిపించక పోగా అద్దె రాయుళ్ల హడావుడి ఎక్కువగా కనిపిస్తుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. అభ్యర్థి వ్యక్తిగతంగా పర్వాలేదన్న భావన ఉన్న పార్టీ తోడ్పాటు పూర్తి స్థాయిలో లేకపోవడం పోలింగ్ సమీపిస్తున్న వేళ పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందన్న భావన వ్యక్తమవుతుంది. గ్రామాల నుంచి బిజెపి కార్యకర్తలు వస్తే పట్టించుకోవడం లేదన్న వాదన కూడా వినిపిస్తుంది. చెప్పే వాడు సరిగా లేక చెడిపోవడం అంటే ఇదేనని బిజెపి అభ్యర్థిని చూసిన తర్వాత అవగతం అవుతుంది. మొత్తంగా పరిశీలించినప్పుడు అసెంబ్లీ ఎన్నికల నాటికి, పార్లమెంటు ఎన్నికల నాటికి బిజెపికి వచ్చే ఓట్లలో పెద్దగా మార్పు ఉండక పోవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. సేవా భావం కలిగిన వ్యక్తి పోటీ చేసినా కేంద్రంలో అధికారంలో ఉండి బిజెపి జాతీయ నాయకత్వం ప్రచారం నిర్వహించినా అద్దె సరుకుతో ఆశించిన ఫలితం దక్కే సూచనలు కనిపించడం లేదు. వికాసించాల్సిన కమలం వాడటానికి కారకులు ఎవరో ఆత్మ పరిశీలన చేసుకుంటే భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో జాగ్రత్త పడవచ్చు. అంతే కాని కోటరీ దాటి బయటకు వచ్చి వాస్తవాలు తెలుసుకోలేని నేతలందరికి ఇదో పాఠమే. అభ్యర్థిని పక్కదారి పట్టించి ఆ తర్వాత నలుగురిలో కూర్చుని ఏమి చెబితే అదే చేసేవారంటూ నవ్వుకునే వారిని ఇప్పటికైనా నమ్మకండి.

# నాకే సానుకూలం.. గెలుపు నాదే..




**ప్రజాపక్షం/ ఖమ్మం :** అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇక బిఆర్ఎస్ కోలుకుంటుందా అన్న ప్రచారం పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు మరో రెండు రోజులు ముందున్న పరిస్థితులను పరిశీలిస్తే చాలా మార్పు కనిపిస్తుంది. నామ నాగేశ్వరరావు పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలత ఏమి లేదనుకున్న బిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అనే పరిస్థితికి తీసుకు వచ్చింది. రెండుసార్లు పార్లమెంటు సభ్యునిగా పనిచేసినా అవినీతి మరక లేకపోవటం, వ్యక్తిగతంగా, రాజకీయంగా ఎవరి వ్యవహారాలలోను జోక్యం చేసుకోకపోవటం అధికార దర్పాన్ని ప్రదర్శించకపోవటం బిఆర్ఎస్ పార్లమెంటరీ నేతగా తెలంగాణకు సంబంధించి చట్ట సభలలో పోరాడారు అన్న పేరు ఆయనకు సానుకూలతను తెచ్చిపెట్టింది. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల నాటి కంటే ఇప్పుడు పార్టీలో కనిపిస్తున్న ఐక్యత కూడా నామకు కలిసి వచ్చే అంశమే. బిఆర్ఎస్ అభ్యర్థి నామ మాట్లాడుతూ నేను గతంలో నాలుగు సార్లు ఎంపిగా పోటీ చేశానని ఎప్పుడు సానుకూలంగా ప్రజలు స్పందించారని పార్టీ ఓటు బ్యాంకు నా వ్యక్తిగత వ్యవహారం సానుకూలంగా ఉన్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో లోపం ఏర్పడిన ప్రతిసారి ప్రజలకు కేసిఆర్ గుర్తుకు వస్తున్నాడని నామ నాగేశ్వరరావు తెలిపారు. తాగు, సాగునీరు విషయంలో కేసిఆర్ పాలనలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది రానివ్వలేదని కేసిఆర్ అధికారంలో లేకపోవడం వలనే ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. శాసన సభ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ పథకాల కంటే కాంగ్రెస్ హామీలు ఎక్కువగా ప్రజలను ఆకర్షించాయని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఉచిత బస్సు మినహా ఏ కాంగ్రెస్ గ్యారెంటీ ప్రజల దరి చేరలేదని మహాలక్ష్మి, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి తులం బంగారం, రుణమాఫీ లాంటి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదన్న భావన ప్రజల్లో కాంగ్రెస్ పై వ్యతిరేకతను తెచ్చిపెట్టిందని నామ తెలిపారు. ఐదారు అంశాలు ఖమ్మం పార్లమెంటు పరిధిలో బిఆర్ఎస్ గెలుపుకు దోహదపడనున్నాయని తెలుగుదేశం తో పాటు వామపక్ష భావజాలం కలిగిన వారు సైతం తన పట్ల సానుకూలంగా ఆలోచించే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ మాదిరే బిజెపి కూడా తమకు రాజకీయ శత్రువేనని నామ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలు ప్రజల్లో తమ పట్ల సానుకూల ధృక్పథంగా మారుతుందన్నారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం ప్రజల తీర్పు జాతీయ స్థాయిలో చర్చకు దారి తీస్తుందన్న నామ దేశంలో ప్రధాని మోడీ చరిష్మా తగ్గిందని బిజెపికి కాని, కాంగ్రెస్ కూటమికి కాని పూర్తి మెజార్టీ వచ్చే అవకాశం లేదన్నారు.

# తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత కేసిఆర్‌దే..



(మొదటిపేజీ తరువాయి)

కేసిఆర్ దేనని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం రఘునాథపాలెం మండల పరిధిలోని చింతగుర్తి, కొర్లబోడుతండా, రాంక్యాతండా గ్రామాలలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతాలలో కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పువ్వాడ అజయ్‌కుమార్ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ తండాలను గ్రామ పంచాయితీలుగా తీర్చిదిద్ది గిరిజనులే పాలన సాగించుకునేలా అవకాశం కల్పించినట్లు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన అన్ని గ్రామ పంచాయితీలకు భవనాలు, గ్రామాలలో హైమాస్ లైట్లు, పార్కులు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామలు, సాగు, తాగునీరు, పింఛన్లు, రైతుబంధు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత బిఆర్ఎస్ దే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరెంటు సమస్యలు మళ్లి మొదటికొచ్చాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇచ్చిందా అని ఎవరికైనా వచ్చిందా అని ప్రశ్నించారు. అబద్ధపు మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్‌వి 420 హామీలని ఎన్నికల కోసమే రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు నాటికి చేస్తామంటూ మళ్లి అబద్దాలు చెబుతున్నారని తెలిపారు. తెలంగాణ గళాన్ని, ప్రజా సమస్యలను పార్లమెంటులో వినిపించాలంటే బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో కారు గుర్తుకు ఓటేసి గెలిపించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అజ్మీర వీరునాయక్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మద్దినేని వెంకటరమణ, మాజీ సర్పంచులు మెంటెం రామారావు, అమాలీ, పద్మ, మాజీ ఎంపిపి శాంత, మాజీ ఉపసర్పంచ్ సురేష్, నాయకులు తాతా వెంకటేశ్వర్లు, తారా చంద్, సీతారాం, పెంట్యా, దేవా, మీటు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్‌లకు
# బుద్ధి చెప్పాలి : కూనంనేని

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ స్థానం నుంచి సిపిఐ మద్దతుతో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. కొత్తగూడెం పట్టణంలోని కూలిలైన్, జిఆర్ బస్తి, హనుమాన్ బస్తి, బూడిదగడ్డ తదితర ప్రాంతాల్లో కార్యకర్తలు, అభ్యర్థితో కలిసి ఇంటింటి ప్రచారంలో కూనంనేని పాల్గొన్నారు. ప్రచారం కోసం వచ్చిన రఘురాంరెడ్డికి కూనంనేనికి బస్తీలోని మహిళలు హారతి పట్టి స్వాగతం పలికారు. ఈస ందర్భంగా బస్తి సెంటర్‌లో జరిగిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని, మత రాజకీయాలతో , కార్పొరేట్ విధానాలతో బిజెపి ప్రభుత్వం కాలం వెళ్లదీసిందని, ఆచరణ సాధ్యం కాని పథకాలతో, అవినీతితో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు, కార్మికులు, కర్షకులకు, ఉద్యోగులకు ఈ రెండు ప్రభుత్వాలు చేసిందేమి లేదన్నారు. రామసహాయంను గెలిపించి చట్టసభకు పంపాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా కాంగ్రెస్ నాయకులు ఆళ్ళమురళి, నాగేంద్ర, త్రివేది, ఎల్.గోపాలకృష్ణ, సిపిఐ నాయకులు, సత్యనారాయణ, నేరెళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజలకు
# సేవ చేసేందుకే రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సిమ్మర్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రఘురాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 140 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలలో ఐదు గ్యారెంటీలను అమలు చేసిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో రైతులకు సంబంధించి రైతు భరోసాను 65 లక్షల మంది రైతులకు అందించడం జరిగిందని మిగిలిన వారికి కూడా అందించడం జరుగుతుందని రఘురాంరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి ఒకటేనని వారికి అంతర్గత పొత్తు ఉండడం వల్లే నామ గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారని కేసిఆర్ ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం పార్లమెంటు ఆది నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఈ కంచుకోటలో మరో గెలుపుకు అవకాశం కల్పించాలన్నారు. బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే పేద, మధ్యతరగతి ప్రజలు ముఖ్యంగా రైతులు ఇబ్బంది పడాల్సి ఉంటుందని మోడీ ఆలోచనలన్ని కార్పొరేట్ సంస్థల చుట్టూనే తిరుగుతున్నాయని రఘురాంరెడ్డి ఆరోపించారు. కోట్లాది రూపాయలు కార్పొరేట్ సంస్థకు కట్టబెడుతూ నేను నీతి పరునన్ని మోడీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచితే బిజెపి దేశాన్ని అప్పుల పాలు చేసిందని ఆయన తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ , ప్రజాస్వామ్యం, లౌకికవాదం మిగలాలంటే రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం ఒక్కటే మార్గమన్నారు. అందుకు ప్రతి కార్యకర్త సిద్దంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల నిఘా విభాగం వైఫల్యం ?

**- మద్యం, డబ్బులతో ఓటర్లకు గాలం ..!**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పార్లమెంట్ ఎన్నిక పోలింగ్ దగ్గర పడుతుండటంతో రాజకీయ పార్టీలు మద్యం, ధనం పంపిణీతో ఓటర్లకు గాలం వేస్తుంది. ఎన్నికల నిఘా బృందాలు ఎక్కడా మచ్చుకైన కనిపించక పోవటంతో బహిరంగంగానే మద్యం, ధనం పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల నిఘా బృందాలు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో రాజకీయ పార్టీలకు అడ్డు అదుపు లేకుండా పంపిణీ కొనసాగిస్తున్నారు. ఎన్నికల అధికారులు మాత్రం మాకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో పలు విమర్శలకు గురవుతున్నారు. ప్రధానంగా పోటీలో ఉన్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఓటుకు రూ.500, క్వార్టర్ సీసాలు పంపిణీ పట్టపగలే ఓటర్ స్లిప్పులు పరిశీలించి ఇంటింటికి వెళ్లి రెండురోజుల నుండి యథేచ్చగా పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో అన్నిరకాల ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. కాని ధనం, మద్యం పింపిణీని అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందాని చెప్పవచ్చు. ఎన్నికలకు నిబంధనలు పకట్బందీగా నిర్వహించాలని చెప్పిన అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయింది. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలు సజావుగా జరిగేందుకు జాతీయ ఎన్నికల కమీషన్ ఆధ్వర్యంలో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు ఎన్నికల కోడ్ నిబంధనలప్రకారం పనిచేయాల్సి ఉంటుంది. కాని మండలంలో అటువంటి నిబంధనలు ఏమి కన్పించటం లేదు. ఇప్పటికైనా నిఘా బృందాలు మద్యం, ధనం పంపిణీతో ఓటర్లను మభ్యపెడుతున్న రాజకీయ పార్టీలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రెండు రోజులు మద్యం విక్రయాలు నిలిపివేయాలి

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల పాటు మద్యం విక్రయాలు నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ రాత్రి 10 గంటల వరకు కమిషనరేట్ వ్యాప్తంగా మద్యం దుకాణాలు బంద్ చేయాలని సిపి సూచించారు. వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, కల్లు కాంపౌండ్లు మూసివేయాలని సిపి ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా రెండు రోజుల పాటు డ్రైడేగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా సహకరించాలని ఆయన కోరారు.

**200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు ...**

పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిపి తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఐదుగురు అంతకు మించి గుమికూడవద్దని ఆయన తెలిపారు. పోలింగ్ రోజు సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని సిపి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# బిజెపి పాలనకు చరమగీతం పాడాలి

## ఆరువేల మంది ప్రవాస భారతీయులు ప్రచారం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదేళ్లు నిరంకుశత్వంగా పాలించిన బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్ తెలిపారు. శుక్రవారం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్ చౌదరి, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగసాని రాజేశ్వరరెడ్డి (యుఎస్ఏ), కార్యనిర్వాహక అధ్యక్షులు సామాల ప్రదీప్, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, కొంటెముక్కుల రవి (సౌతాఫ్రికా) లు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పారని అదేవిధంగా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి పార్టీకి ప్రజలు గుణ పాఠం చెప్పాలన్నారు. బిజెపి పాలనలో ప్రజల సొమ్మును కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు లేకుండా చేస్తామని చెబుతున్న బిజెపికి ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం దేశ వ్యాప్తంగా ఆరువేల మంది ప్రవాస భారతీయులు పని చేయడానికి స్వచ్ఛందంగా వచ్చారన్నారు. రాహుల్ గాంధీ జోడోయాత్రలో ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గుర్తు హస్తం గుర్తుకు ప్రజలు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రవాస భారతీయుల తరుపున కోరారు.

# రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మద్ది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సూక్ష్మంగా ఆరు గ్యారెంటీలు ఇచ్చినప్పటికీ స్థూలంగా 13 గ్యారెంటీలు ఇచ్చిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ. 10లక్షల వర్తింపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు రూ. 500లకు గ్యాస్ సిలెండర్, ఒక్కో నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు వంటి కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. 97 శాతం మంది రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయం అందించిందన్నారు. ఆగస్టు 15 లోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జనగణన చేసి ఎస్సి, ఎస్టి, బిసి లకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పిస్తుందన్నారు. నిరంకుశ పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి ప్రజలు గుణ పాఠం చెప్పాలని కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి గుర్తు హస్తం గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ వినోదా, లీగల్ సెల్ నాయకులు మోజెస్ క్రిష్టోఫర్, గోరంట్ల శాంతారావు, కంచర్ల సైదులు, బానోత్ మంగూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో పలు కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల పరిధిలోని పరికలబోడు తండా గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన భూక్యా చందర్ రాథోడ్, తేజావత్ మంగీలాల్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నుంచి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బానోత్ శ్రీను, దరావత్ దేవా, మోతీలాల్, రంజిత్, బిక్కు, గాంధీ, మోహన్, నాగ సురేష్, బాషా, చందులాల్, మోహన్ లాల్, సూర్య, రమేష్, బానోత్ స్వామి, గోరు, గమటా, రామారావు, వీరు, సోమ్లా, ఈర్యా, కీడా తదితరులు పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో దరావత్ రామ్మూర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బూడిదంపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాజీ ఎంపిటిసి కేలోత్ బాసు, శంకర్, శ్రీను లతో పాటు పలు కుటుంబలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్ లు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చోటాబాబా, గౌస్ పాషా తదితరులు ఉన్నారు. 42వ డివిజన్ కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ మజీద్, ఫర్వీన్ లు 58వ డివిజన్‌లో తంగిరాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వత్సవాయి సతీష్, రేగళ్ల కృష్ణ లతో పాటు పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుల, నగర అధ్యక్షులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో వివిధ పార్టీల నుంచి భారీ గా కాంగ్రెస్‌లో కి వలసలు పెరిగాయి. శుక్రవారం మండలం లోని ముజ్జుగూడెం లో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ నుంచి కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన దేవరశెట్టి రాము కాంగ్రెస్ లీగల్ సెల్ లో మాజీ అధ్యక్షుడు దండా సుధాకర్ సమక్షంలో చేరారు. అదే విధంగా బైరవునిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కు చెందిన పలు కుటుంబాలు జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సమక్షంలో చేరారు. వీరికి కండువా కప్పి సాదారంగా అహ్వానించారు. పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# దళితులకు సేవ చేసిన పార్టీ కాంగ్రెస్



**ప్రజాపక్షం/ మధిర :** దళితులకు సేవ చేసిన పార్టీ కాంగ్రెస్సేనని, దళిత వ్యతిరేక పార్టీ బిజెపిని నమ్మి మోసవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా దళితవాడలను అభివృద్ధి చేసిందని కాంగ్రెస్సేనని అన్నారు. దళితులు బిజెపికి మద్దతు తెలిపితే రాష్ట్రం మణిపూర్‌గా మారుతుందని, గత బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలు దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. తెలంగాణలో ఉన్న మాదిగలందరూ కాంగ్రెస్‌కే పట్టం కట్టాలని, దళిత నేతలు ఈ విషయంపై పునరాలోచన చేసి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని, కాంగ్రెస్‌తోనే దళితుల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు యర్రగుంట రమేష్, బొబ్బిళ్లపాటి బాబురావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండ లం చిన్న కోరుకొండి గ్రామంలో ఉపా ధి హామీ కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు శుక్రవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో చిన్న కోరుకొండి గ్రామంలో చెరువు మట్టి తోల కాలలో భాగంగా చేస్తున్న పని సమయంలో కూలీలకు ఓఆర్ఎస్ మజ్జిగ ప్యాకెట్లను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు ఈఊరు నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ చిన్నాల వెంకటేశ్వరరావు, శివ నామా విజయ్, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 13న జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

# విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో శుక్రవారం పొట్రు శ్రీను (50) విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. తన పొలంలో ఉన్న పశుగ్రాసంలో నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురైనట్లు కుటుంబీకులు తెలిపారు. అతనికి భార్య లక్ష్మీ రాజ్యం, కార్తీక్ కుమారుడు (లండన్), ప్రత్యూష కుమార్తె (అమెరికా) లలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయన మృతితో కుటుంబం విషాదఛాయలలో మునిగి ఉంది. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు ఆ కుటుంబాన్ని సందర్శించి భౌతిక దేహానికి నివాళులర్పించి సంతాపాన్ని సానుభూతిని ప్రకటించారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని కోతులగుట్ట సబ్‌స్టేషన్ మెయింటినెన్స్‌లో భాగంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 9వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలగునందని, ఏఈ క్రాంతిసింహ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదులాపురం, పెద్దతండా, గుర్రాలపాడు, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పొన్నెకల్లు, తల్లంపాడు గ్రామ పంచాయతీల పరిధిలోని ఏరియాలలో సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఖమ్మం రూరల్‌కు చేరిన ఓటుహక్కు బైక్‌యాత్ర



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** జాతీయఅవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ మానుకోట నుంచి ప్రారంభించిన ఓటర్‌చైతన్య బైక్‌యాత్ర శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెంపంచాయతీపరిధిలోని మారెమ్మగుడి వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ఓటు హక్కు విలువను తెలిపే కరపత్రాలను అక్కడి ప్రజలకు పంపిణీ చేశారు. అదేవిధంగా ఓటుహక్కుపై వికాసవేదిక సాహిత్యసంస్థ ఆధ్వర్యంలో కాచిరాజుగూడెంలోని సాహితీ కుటీరంలో ప్రజాస్వామ్యమా వర్ధిల్లు అనే పేరుతో సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో వికలాంగుల సంఘం జిల్లా నాయకులు ఉపేందర్‌గౌడ్, ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, రణ్‌ధీర్, రాకేష్, ఎల్లమ్మ, లక్ష్మయ్య, ఆశా, సురేష్, కవిసమ్మేళ్లనంసంస్థ గౌరవాధ్యక్షులు బుక్కా సత్యనారాయణ, ఆవుల వీరభద్రం, గరిడేపల్లి శోభనాద్రి, మందుల వీరభద్రం, రమేష్‌బాబు, శేఖర్‌బాబు, నల్లా కృష్ణమూర్తి, జివి కాంతేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పాలేరు నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ సమావేశం



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని సాయిగణేష్‌నగర్‌లో పాలేరునియోజకవర్గస్థాయి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ...మే13న జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో ప్రజలు కారుగుర్తుపై ఓటు వేసేలా చూసుకోవాలని వారికి దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీతాతా మధు, నియోజకవర్గ సమన్వయకర్త తాళ్లూరి జీవిన్‌కుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, జెడ్పిటీసీ యండపల్లి వర ప్రసాద్, నాయకులు గూడా సంజీవరెడ్డి, బానోత్ కృష్ణ, బానోత్ వీరన్న, ముత్యం పెద్ద కృష్ణారావు, మట్టా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు




ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్ బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఆ పార్టీ నాయకుడు వెంపటి రవి ఆధ్వర్యంలో పలువురు చేరారు. వీరిని సాయిగణేష్‌నగర్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పార్టీ జెండాను కప్పి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలోకి రాంశెట్టి రమేష్, ఆకుల నాగేశ్వరరావు, కారుమంచి రాంబాబు, ఎర్ర నరేందర్‌రెడ్డి, అఖిల్, పింగళి భాస్కర్, పెండ్లి విద్యాసాగర్‌రెడ్డి, తాళ్లపుచురెడ్డి సిద్దారెడ్డి, గోన్ గిరధర్‌రెడ్డి, నాగరాజు, కోకటి రాజేందర్‌రెడ్డి చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంపటి వెంకన్న, కల్లెం శశిరెడ్డి, ఎన్‌పి చారి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంను పాలకులు పట్టించుకోలేదు..

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖమ్మం అభివృద్ధి ని గత పాలకులు పట్టించుకోలేదని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. నేలకొండపల్లి లో జరిగిన రోడ్ షో లో ఆయన ప్రసంగించారు. ఖమ్మం ను పూర్తిగా విస్మరించారని అన్నారు. ఖమ్మం లో బీజేపీ గెలుపు ను ఏ శక్తి అడ్డుకోలేదని అన్నారు. నన్ను దీవిస్తే...మోడీ ని దీవించినట్టే అన్నారు. బీఆర్ఎస్ , కాంగ్రెస్ కు ఓటు వేయవద్దని అన్నారు. మోడీ ని మూడోసారి ప్రధాని చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. దొంగ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. నన్ను గెలిపిస్తే ఖమ్మం ను అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా పని చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి కుమార్, చావా కిరణ్, కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, షర్ఫీద్దీన్, మోహినుద్దీన్, టీడీపీ నాయకులు కొండబాల కరుణాకర్, ఆరెకట్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపుతో రైతులకు మేలు




ప్రజాపక్షం/కొణిజర్ల : పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడంద్వారా దేశ సమైకృత సమగ్రతతోపాటు రైతులకు మేలు జరుగుతుందని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ , ప్రగతిశీల రైతుసంఘం జిల్లా నాయకులు పాశం అప్పారావు పేర్కొన్నారు. శుక్రవారం దొండపాటి భవన్‌లో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఎస్‌కెఎం వామపక్ష రైతుసంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. 10 సంవత్సరాలుగా కార్మిక కర్షక రంగంలో తీవ్రమైన సంక్షోభానికి గురైందని అన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక , రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి కార్పోరేట్ శక్తులకు అనుకూలమైన అమలుచేయడం కోసం తీసుకున్న నిర్ణయాలను ఉద్యమాలద్వారా ఎదుర్కోవడం జరిగిందని అన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఎస్‌కెఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం , స్వర్ణ రమేష్ , కాంగ్రేస్ రైతుసంఘం నాయకులు నెల్లూరి రమేష్ , తాళ్లపల్లి కృష్ణ , తండు సోమయ్య, తోటపల్లి సీతారాములు , వెంకటేశ్వర్లు , కొమ్మినేని వెంకయ్య, తాతా వెంకయ్య, పారుపల్లి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తం గుర్తుపై ఓటు వేసి రఘురాంరెడ్డిని ఆశీర్వదించాలి

**- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**





ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : సిపిఐ, సిపిఎం పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి హస్తం గుర్తుపై ఓటు వేసి ప్రజలు ఆశీర్వదించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డు, ఏదులాపురం, సింహాద్రినగర్, ఆదిత్యనగర్‌తో పాటు తదితర కాలనీలలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మతోన్మాద మోడీ ప్రజలను రెచ్చగొడుతూ వైశ్యామ్యాలకు ఆద్యం పోస్తూ అంతరాలను సృష్టిస్తున్నారన్నారు. దీంతో ప్రజలు కుల, మతాలుగా విడిపోయి తన రాజకీయ లబ్ధికి పావులు కావాలని ఎత్తుగడ పన్నినట్లుగా ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. బిజెపికి, బిఆర్ఎస్ బీటీం అని వారి అభ్యర్థులు గెలిచిన బిజెపికి మద్దతు ఇస్తారన్నారు. కాబట్టి ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మే13న ఎన్నికల పోలింగ్‌లో హస్తం గుర్తుపై ఓటు వేయాలన్నారు. అనంతరం ఆయా ప్రాంతాలలోని ఇంటికి తిరుగుతూ ఎన్నికల ప్రతులను అందజేసి,ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, ఐఏఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి మామిడి శంకరయ్య, మండల కార్యవర్గ సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, రామిడి రమేష్, వెన్నం భాస్కర్, వెంపటి రాము, మేళ్లచెర్వు గురవయ్య, దొంతగాని వెంకన్న, నాయకులు ఏర్పుల బ్రహ్మం, నారపాటి రామారావు, యువజన సంఘం నాయకులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, గణపరపు ఉపేందర్, రెబ్బగొండ్ల గోపి, మామిడాల కిరణ్, తనకం భాస్కర్, కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్ నాయక్, వెంపటి రవి తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లిలో ఉపాధి కూలీల రాస్తారాకో

ప్రజాపక్షం/నేలకొండపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు శ్రమ కు తగిన కూలీ పడటం లేదని...ఇలా అయితే తాము పనులు చేయలేమని కూలీలు ఆగ్రహించి రాస్తారాకో చేశారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని కట్టలమ్మ చెరువులో దాదాపు 200 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. కాగా ఎర్రటి ఎండలో తాము కష్ట పడుతున్నా...శ్రమకు తగిన వేతనం అందటం లేదని ఆగ్రహించారు. తొలుత పనులు చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఖమ్మం కోదాడ ప్రధాన రహదారి పై రాస్తారాకో నిర్వహించారు. ఘటనా స్థలం కు పోలీసులు చేరుకుని ఆందోళనకారులతో చర్చించి ఆందోళన ను విరమింపచేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడారు...చేసిన పనికి సక్రమంగా కూలీ పడటం లేదని అన్నారు. ఇలా అయితే తాము పనులు చేయమని హెచ్చరించారు. ఒకే గుంపు లో పని చేసే వారికి కూడ వేర్వేర్ గా కూలీ పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా....ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన రాస్తారాకో చేసిన కూలీల పై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం




ప్రజాపక్షం/మణుగూరు: మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ మణుగూరు పి వి కాలనిలో శుక్రవారం సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి సెక్రెటరీ వై రాంగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని ప్రైవేటుపరం చేస్తుందని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందన్నారు. సింగరేణిలోని మైన్స్‌లను ప్రైవేటు వారికి అప్పజెప్పడానికి టెండర్లను పిలిచిందని, వీటి రద్దుకు ఏఐటియుసి పోరాడుతుందని అన్నారు. మోడీ హటావో, దేశ్ కు బచావో నినాదంతో ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలైన సిపిఐ, ఏఐటీయూసీ యూనియన్ తరపున కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా మద్దతిస్తున్నామని, కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ హస్తం గుర్తుకు అధిక సంఖ్యలో ఓట్లు వేసి గెలిపించాలని కార్మిక వాడల్లో ప్రజానీకాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ యం. రామనర్సయ్య, బ్రాంచి సహాయ కార్యదర్శి పుల్లారావు, బ్రాంచి ఆర్గనేజింగ్ కార్యదర్శులు ఆదేర్ల సురేందర్, షేక్ సుభాని, ఆడెపు రాజశేఖర్, శరత్, శివ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మోడీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదు




ప్రజాపక్షం/మణుగూరు: కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని అవలంబిస్తుందని సింగరేణి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా కార్యదర్శి ఆదేర్ల సురేందర్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హై పవర్ వేతనాలు ఇవ్వకుండా వాళ్ళ జీవితాలు దుర్భరమవుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మోడీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదని, కాంట్రాక్టు కార్మికులందరూ కాంగ్రెస్ కి సపోర్ట్ చేసి గెలిపించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులు అందరూ కాంగ్రెస్ పక్షాన నిలబడ్డారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం తప్పదని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం తప్పదని, మతోన్మాద బిజెపి వలన దేశానికి ప్రమాదం వుందని, మత పిచ్చితో రాజకీయం చేయడం మనుషుల మధ్య చిచ్చు పెట్టడమే అన్నారు. భారత రాజ్యాంగం నిర్మూలన దిశగా మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రిజర్వేషన్లు తొలగించాలనే కుట్రను తిప్పి కొట్టాలని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు అన్నిటిని కూడా వేలం వేసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే ప్రజా సంక్షేమం

**-నేటి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**
**-గులాబీ జెండా తెలంగాణకు అండ**
**-జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత**





ప్రజాపక్షం/బూర్గంపాడు : బిఆర్ఎస్ హయాంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగామని, నేటి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత అన్నారు. శుక్రవారం వేపలగడ్డ గ్రామ పంచాయితీలో రాష్ట్ర మాజీ ప్రభుత్వ విప్, మాజీ పినపాక శాసన సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మహబూబాబాద్ బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి మాలోత్ కవితని గెలిపించాలని కోరుతూ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి కవితను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పార్లమెంట్ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి మహబూబాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలన తలాతోక లేని విధంగా ఉన్నదని మోసపూరిత హామీలు 420 ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను ఆగం చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు నెలలుగా సరిగ్గా కరెంటు లేక రైతులు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే మనం కేసీఆర్ కు బలం చేకూర్చే విధంగా బిఆర్ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంజా చిన్నబ్బాయి, నాయకులు తాటి వెంకటేశ్వర్లు, కుంజ సత్యనారాయణ, సోయం ప్రసాద్, తాటి శంకర్, మెండి రవికుమార్, బాడిషా పెద్దిరాజు, కుంజ వెంకటేశ్వర్లు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

**ఆర్టిఐ మాజీ కమిషనర్ డా.గుగులోతు శంకర్ నాయక్**



ప్రజాపక్షం/కూసుమంచి : ఈ నెల 13న జరిగే పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాష్ట్ర సమాచారం మాజీ కమిషనర్ డాక్టర్ శంకర్ నాయక్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూసుమంచి మండల కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా నాయకులు పెండ్ర అంజయ్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసాయ రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ, పాలేరు నియోజకవర్గం గిరిజనుల ఈ మీడియా సమావేశంలో నాయకులు కార్యకర్త లను ఉద్దేశించి వారు మాట్లాడుతూ భారత దేశంలో కాంగ్రెస్ పార్టీ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ గారి నాయకత్వంలో దేశంలో అనేక సవరణలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసారని కొనియాడారు. ఇప్పుడు దేశంలో బిజెపి నరేంద్రమోడి ప్రభుత్వం ఈ పది సంవత్సరాలలో పేద ప్రజలకు చేసింది ఏమి లేదని కేవలము మనుషుల మధ్య, కులాల మధ్య చిచ్చు పెడుతూ విభజించి లబ్ధి పొందాలని, ప్రయత్నిస్తూ దేశంలో మణిపూర్ కాశ్మీర్ రాజస్థాన్ తెలంగాణ మేఘాలయం త్రిపుర లాంటి రాష్ట్రాలలో అనేక సమస్యలను సృష్టించి మత విద్వేశాలను రెచ్చకొడుతుందని వారు విమర్శించారు. హస్తం గుర్తు పేదోళ్లకు నేస్తం అందుకోసమే మే 13వ తారీఖున జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు గాబరా గాబరా కాకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాహుల్ గాంధీ నీ ప్రధానమంత్రి చేసుకొవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి, చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని శంకర్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెండ్ర అంజయ్య, రిజన లక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు, శ్రీనివాస్ నాయక్, బి నాగ, అనిల్ కుమార్, ఓయూ క్యాంపస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్‌నే శ్రీరామరక్ష అని, బిఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బూర్గంపాడు మండల సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బూర్గంపాడు గ్రామ పంచాయితీలో రాష్ట్ర మాజీ ప్రభుత్వ విప్, పినపాక మాజీ శాసన సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మహబూబాబాద్ బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని ఆయన ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గతంలో బిఆర్ఎస్ పార్టీ రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు భీమా వంటి అద్భుతమైన పథకాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షులు గోనెల నాని, మండల ప్రచార కార్యదర్శి తోకల సతీష్, మండల మైనార్టీ అధ్యక్షులు సాధిక్ పాషా, మాజీ జెడ్‌పిటిసి భూపల్లి నర్సింహారావు, పార్టీ నాయకులు కెవి రమణ, మంద ప్రసాద్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని కొర్లగూడెం సొసైటీ చైర్మన్ వైఎస్ఆర్ వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ బైరెడ్డి నరసింహారెడ్డితో పాటు మాజీ పాలకవర్గం కల్లూరులో శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు, అట్టి రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షులు తాత మధుకు అందజేసినట్లు తెలిపారు. మా గ్రామ అభివృద్ధికి ఎవరు మద్దతు ఇస్తారో వారి వెంట మేము ఉండి మద్దతు తెలియజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. వారి వెంట వారి అనుచర వర్గం కూడా రాజీనామా చేసినట్లు వారి పేర్కొన్నారు.

## అభివృద్ధిని చూసి నామకు ఓటేయండి



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండలంలో మాజీ పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరారావు మండలాన్ని అన్ని రంగాల్లో అభి వృద్ధి చేశారని దీని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నామా నాగేశ్వరరావుకు ఓటు వేసి గెలిపించాలని బిఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు భూపతి రమేష్ అన్నారు. శుక్రవారం రావికంపాడు గ్రామ పంచాయితీలో ఉపాధి హామీ కూలీలను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందజేసిందని గుర్తు చేశారు. రైతు బంధు, కళ్యాణ లక్ష్మీ , షాదీముబారక్, పెన్షన్లు అందజేసిందన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలతో గద్దెనెక్కి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అజ్మీర రమేష్, ఇస్లావత్ ఎంకన్న, ఖమ్మం పార్టీ శివ, భూక్య భద్రు, అనిల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నామ నాగేశ్వరరావును గెలిపించండి



ప్రజాపక్షం/ములకలపల్లి: ఖమ్మం బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి పార్లమెంట్ లో ప్రశ్నించే గొంతుక కావాలంటే టిడిపి పక్ష నేతగా, బిఆర్ఎస్ పార్టీ పక్ష నేతగా పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై గళం వినిపించిన నూతా, కేసీఆర్ నమ్మిన బంటు నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం లోకల్ అభ్యర్థి రైతు బిడ్డ నిత్యం ప్రజా సమస్యల మీద పోరాడే వ్యక్తి, టిడిపి పార్టీలో ఉన్నా కూడా తెలంగాణ కోసం పార్లమెంట్‌లో మొట్టమొదటి ఓటు వేసిన నాయకుడు నామా నాగేశ్వరరావు కారు గుర్తుపై మీ అమ్యూలమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో తిమ్మంపేట గ్రామ పంచాయితీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

## రఘురాంరెడ్డిని గెలిపించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రాఘురామ్‌రెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించా లని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం జగన్నాధపు రం పంచాయితీలోని నరసాపురం గ్రామంలో ఈనెల 13వ తేదీన జరగబోయే ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వస్తే ఉపాధి హామీ రోజు వారి దినసరి కూలీ రూ 400 ఇస్తుందని తెలిపారు. వేసవికాలం వలన ఎండలు అధికంగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. ఉపాధి హామీ పనులు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుంటూ మీ అమూల్యమైన ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో నాయ కులు సున్నం సునీత, మరీదు నాగేశ్వరరావు, కుంజా వినోద్, పామర్తి వెంకటేశ్వరరావు, పామర్తి కృష్ణ, గుంటూరు ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బలరాం నాయక్‌ను గెలిపించాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని డిసిసి మైనార్టీ సెల్ ఛైర్మన్ మహిముద్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిజెపి ప్రభుత్వ పరిపాలనలో రైతుల, కార్మికుల పట్ల బిజెపి వ్యతిరేక విధానాలను ఆవలంభిస్తూ ప్రమాదకరమైనటువంటి పరిపాలన కొనసాగించిందని, బిజెపిని ఓడించి కాంగ్రెస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్క ముస్లీం బాధ్యతగా తమ తమ ఓటు హక్కు వినియోగించాలని, ఓట్లు చీలకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మైనార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో 100శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరు బిజెపి ఓటమే లక్ష్యంగా ఓటర్లను చైతన్యపరిచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

### పాఠశాలలు పునః ప్రారంభించే నాటికి

# అన్ని సౌకర్యాలు సమకూర్చాలి : ఐటిడిఏ పిఓ





**ప్రజాపక్షం/కరకగూడెం:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల మరియు వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించే నాటికి అన్ని వసతీ సౌకర్యాలు సమకూరే విధంగా స్పెషలాఫీసర్లు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అన్నారు. శుక్రవారం కరకగూడెం, పినపాక మండలంలోని ఎల్‌సి రెడ్డిపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఎల్ సి రెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలకు సెలవులు ఇచ్చినప్పటినుండి పాఠశాలను, తరగతి గదులను శుభ్రం చేయకుండా ఉండడంతో సంబంధిత హెచ్ఎం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతిరోజు పాఠశాలలను శుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు ఉన్నందున తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పాఠశాలకు సంబంధించిన ప్యాచ్ వర్కులు ,మైనర్ రిపేర్లు, ప్రతి తరగతి గదిలో, డైనింగ్ హాలులో ,డార్మెటరీలలో, గాలి వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి పాఠశాల హాస్టల్ లలో వెంటిలెటర్స్ కి క్రిమి కీటకాలు రాకుండా మెస్ వేయించాలని, డార్మెటరీ తరగతి గదులకు ఆల్ఫాబెట్ల ప్రకారం నంబర్లు వేయాలని, విద్యార్థిని విద్యార్థులు పడుకునే రూములలో నాలుగు బెడ్లకు కలిపి ఒక ఫ్యాన్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. పాఠశాలలకు సంబంధించి మైనర్ రిపేర్లు మరియు ట్యూబ్ లైట్లు ఫ్యాన్లు అమర్చే పనులు త్వరితగతిన పనులు ప్రారంభించి, ఈనెల 20వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తి కావాలని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు కింద పడుకోకుండా డబుల్ కాట్ మంచాలు కట్ చేయించి ప్రతి విద్యార్థి మంచాల మీదే పడుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. బాలికల పాఠశాలల్లో తప్పనిసరిగా బాలికలకు ఇబ్బందులు కలగకుండా ధోబిఘాట్ లాంటి ప్లాట్ఫామ్ ఏర్పాటు చేయాలని, డ్యూయల్ డెస్క్ బల్లలు పాడైపోతే వెంటనే రిపేరు చేయాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులకు టాయిలెట్లు, వాష్ రూములలో అపరిశుభ్ర లేకుండా శుభ్రంగా ఉండేలా ఏర్పాటు చేయాలని, పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, డ్రైనేజీలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. పాఠశాలలో తెరిచే నాటికి విద్యార్థిని విద్యార్థులు రాగానే వారు ఇంటిని మర్చి పోయేలా మంచి వసతి సౌకర్యాలు కల్పించి వారి విద్యకు ఆటంకం కలగ కుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మరల ఆకస్మిక తనిఖీకి వచ్చేనాటికి కరకగూడెం, ఎల్ సి రెడ్డిపల్లి పాఠశాలల్లో అన్ని రకాల పనులు పూర్తి కావాలని, లేనియెడల సంబంధిత సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం పాఠశాలలోని వంట గదులు, డబుల్ కాట్ మంచాలు, మరియు గోడలకు జరుగుతున్న ప్యాచ్ వర్క్ లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్/ఉద్యానవన అధికారి అశోక్ మరియు ఎల్సిరెడ్డిపల్లి పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఒక విషవృక్షం.. ఓటు వేయొద్దు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బిజెపి ఒక విషవృక్షం అని, దానికి ఓటు వేయాల్సిన అవసరం దళిత సమాజానికి లేదనీ ఖమ్మం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొందయ్య అన్నారు. శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామ్ సహాయం రఘురాం రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత డిక్లరేషన్ ఇచ్చిందన్నారు. బిజెపి ఉన్న రిజర్వేషన్లు తీసేస్తానంటుందన్నారు. ఏ విధంగా బిజెపికి మంద కృష్ణ మాదిగ మద్దతు తెలుపుతున్నారో అర్థం కావడం లేదన్నారు. దళిత రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్వలాభం కోసం మందకృష్ణ మాట్లాడుతున్నారన్నారు. దళితులకు బిజెపి ఏం చేసిందో తెలపాలన్నారు. దళిత నాయకులను పెంచి పోషించిందా అని ప్రశ్నించారు. బండారు లక్ష్మ ణ్ లాంటి దళితులకు బిజెపిలో అవమానాలు జరిగాయన్నారు. అక్రమ కేసులు బనాయించి ఆయన పదవులను తొలగించారన్నారు. బిజెపి మంత్రులు బహిరంగ సమావేశాల్లోనే రిజర్వేషన్లు తీసేస్తామని, రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలోనే దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దళితులు స్వేచ్ఛగా మాట్లాడడానికి తిరగడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కమల్ భాష , క్రిస్టియన్ మైనార్టీ జాతీయ నాయకులు అలవాల కరుణాకర్, వరప్రసాద్, పింగిలి సామెల్ బత్తుల భరత్ మల్లూరి దిలీప్, కుమార్, రాము వివిధ మండలాల నుంచి వచ్చిన ఎస్సీ యువత, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించండి



**ప్రజాపక్షం/దమ్ముపేట:** పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్టు బిజెపి మతతత్వ పార్టీని ఓడించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని లింగాలపల్లి, గొర్రెగుట్ట, గండుగులపల్లి గ్రామాలలో ఉపాధి కూలీలతో రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలు పంచుతూ నిర్వహించిన ప్రచారంలో భాగంగా రాము మాట్లాడుతూ కేంద్రంలో 10 సంవత్సరాల కాలంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కూలీల బడ్జెట్‌ను 155 వేల కోట్ల నుండి కేవలం 65 వేల కోట్లకు బడ్జెట్‌ను తీసుకొచ్చారంటే ఉపాధి కూలీని పూర్తిగా నిర్వీర్యం చేయడం కొరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు కుర్సం ముత్యాలరావు, మండల నాయకులు చాపా ముత్యాలరావు, పండూరి వీరబాబు, వాడే గిరి, ఉపాధి కూలీలు కాక చక్రవర్తి, సోయం సూరమ్మ లక్ష్మి, యశోద, వెంకటమ్మ, పద్మ, సరోజిని సుశీల బాలమ్మ తులసమ్మ, రాములమ్మ, పండా శ్యామల, ఊకే యశోద, గుండి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు టిబిజికెయస్ బాధ్యులుగా నాగెల్లి

**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం మణుగూరు ఏరియా ఇన్ చార్జి నాయకులుగా ఏరియా లోని కొండాపురం భూగర్భ గని నందు విధులు నిర్వహిస్తున్న నాగెల్లి వెంకటేశ్వర్లు ను నియమిస్తూ టి బి జి కె యస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసి ఆ ఉత్తర్వు కాపీని ఏరియా జనరల్ మేనేజర్ కు పంపించారు. కార్మిక సమస్యల పట్ల చిత్తశుద్ధి గా వ్యవహరిస్తూ సింగరేణి పురోభివృద్ధి కోసం, నిరంతరం నిస్వార్థంగా అంకిత భావంతో పని చేస్తానని మణుగూరు ఏరియా టి బి జి కె యస్ బాధ్యులుగా ఎన్నికైన నాగెల్లి తెలిపారు. తనపై ఉన్న ఎంతో నమ్మకంతో ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం భాధ్యతలు అప్పగించినందుకు ముందుగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డికి, జనరల్ సెక్రటరీ కాపు కృష్ణకి, తోడ్పాటు అందించిన భద్రాద్రి కొత్తగూడెం బి అర్ యస్ జిల్లా అధ్యక్షులు, మాజీ పినపాక శాసన సభ్యులు రేగా కాంతరావులకు హృదయ పూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన




**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలోని తాటి గూడెం గ్రామం లోని ఎంపీపీ స్కూల్ 29 పోలింగ్ స్టేషన్, పద్మాపురం గ్రామంలోని 30 నంబర్ పోలింగ్ స్టేషన్ ను పినపాక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పరిశీలించి పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని నయాబ్ తహశీల్దార్, ఎలక్షన్ డీ టీ నాగరాజుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం నాయక్‌ను గెలిపించండి



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం బూత్ నర్సంపేట కాలనీలోని అజ్మీర సీతారాం నాయక్ గెలుపు కోసం శుక్రవారం వారి కోడలు ప్రియాంక విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయుని ఆలయ నిర్మాణం కోసం రూ.10,000/లు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగనపల్లి నాగేశ్వరరావు, మండల జనరల్ సెక్రెటరీ గోగు రనిల్, పోలబోయిన సారయ్య, రామటంకి రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నామను గెలిపించండి

**ప్రజాపక్షం/కారేపల్లి:** పోలంపల్లి గ్రామపంచాయతీలో మన ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ గ్రామ ప్రజలకు, ఉపాధి హామీ కూలీల సమక్షంలో బ్యాలెట్ నమూనాను చూపిస్తూ ఓటు వేయడంపై అవగాహన కల్పిస్తూ గ్రామ ప్రజలకు ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి జగన్‌నాయక్, మాజీ సర్పంచ్ సక్రు నాయక్, మాజీ ఉప సర్పంచ్ మూతి కోటయ్య, యువకులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నటుడిగా రాణిస్తున్న నెమలి శ్యామ్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/ మధిర :** ఖాజీపురం గ్రామానికి చెందిన యువ దర్శకుడు ఎఆర్.సమీర్ దర్శకత్వంలో రూపొందించిన బాబు గాడి జాబు చిత్రంలో విలన్ పాత్రలో నటించిన నెమలి గ్రామానికి చెందిన నెమలి శ్యామ్ సినిమాల్లో రాణిస్తుండటం పట్ల దర్శకులు ఎఆర్.సమీర్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన ప్రసన్నవదనం, త్వరలో విడుదలకానున్న నాగచైతన్య తండేల్ సినిమాలో కూడా నటించాడని, షార్ట్ ఫిలంలో తమతో పాటు తనదైన శైలిలో నటించి విలక్షణ నటుడిగా పేరొందిన నెమలి శ్యామ్ వెండితెరపై నటించటం సంతోషంగా ఉందన్నారు. నెమలి శ్యామ్ ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



**ప్రజాపక్షం/ మధిర :** ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మధిరలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మధిర పట్టణంలోని అన్నపూర్ణ మెస్ పక్కన విజయవాడ నుండి వచ్చిన అఖిల(22)అనే మహిళ, మరొక వ్యక్తి అద్దెకు నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం మధ్యాహ్నం సమయంలో అఖిల ఉరివేసుకుని చనిపోయి ఉండటాన్ని గమనించిన స్థానికులు టౌన్ పోలీసులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్కే ఫౌండేషన్ సహకారంతో మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మల్లు భట్టివిక్రమార్క నందిని దంపతులు పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మల్లునందిని భట్టివిక్రమార్క దంపతుల 29వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వైరా మండలం గొల్లపూడిలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంతోషం పంచుకున్నారు. నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా సంతోషంగా మల్లు భట్టివిక్రమార్క మల్లు నందిని దంపతులు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, వైరా మండల కాంగ్రేస్ నాయకులు పల్లపు కొండలు, ఇజ్జగాని సత్యనారాయణ, అలియాస్ నిప్పు, ఇక్కుర్తి ఉపేందర్‌రావు, ఫాస్టర్ పాల నర్సింహారావు, విజయ చంద్రకళ, పలువురు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ రాష్ట్ర నాయకులు బందెల నర్సయ్య మృతి

**-నివాళులర్పించిన ఎమ్మెల్యే కూనంనేని**
**-బందెలకు కన్నీటి వీడ్కోలు పలికిన సిపిఐ శ్రేణులు**







**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బందెల నర్సయ్య(64) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. మృతదేహాన్ని ఆయన స్వగృహం చుంచుపల్లి మండలం, రుద్రంపూర్ ఏరియాకు తరలించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు బందెల మృతదేహంపై పార్టీ జెండానుపూలమాల ఉంచి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంతంలో పార్టీ విస్తరణకు ఎనలేని కృషిచేశారని, సింగరేణి వర్కర్స్ యూనియన్ నాయకుడిగా, బాధ్యతలు నిర్వహిస్తూ సేవకే అంకితమయ్యాడని అన్నారు. ప్రజా కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేశాడని అన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఉద్యమ సహచరుడిగా కొనసాగిన నర్సయ్య మృతి బాధాకరమన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని, అమరుడి ఆశయాల సాధనకు కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నర్సయ్య మృతి పట్ల సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు బందెలకు కన్నీటి వీడ్కోలు పలికారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, దుర్గరాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనిఆస్, మున్నాలక్ష్మి కుమారి, రంగయ్య, సలీం, నరాటి ప్రసాద్, పుల్లారెడ్డి, సారయ్య, బ్రహ్మం, వాసిరెడ్డి మురళి, దమ్మాలపాటి శేషయ్య, గనిగళ్ళ వీరస్వామి, దమ్మాలపాటి శేషయ్య, వంగ వెంకట్, జి.వీరస్వామి, కంచర్ల జమలయ్య, పూర్ణచందర్‌రావు, సాయిబాబు, ముగిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమారి, గెడ్డాడు నగేష్, భూక్యా దస్రు, జక్కుల రాములు, కుమారి హన్మంతరావు తదితరులు ఉన్నారు.

# ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నిషేద ఆజ్ఞలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 13న జరగనున్న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో సజావుగా జరిగేలా చూసేందుకు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేజ్ఞలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు, ఊరేగింపులు, మైకుల ద్వారా అన్ని రకాల ప్రచారాలు నిషేధించబడతాయని సిపి తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో సంఘ వ్యతిరేక శక్తుల జోక్యాన్ని అరికట్టడానికి సెక్షన్ 22(1) (డి) టూ (ఎఫ్) మరియు 22 (22) (2) (ఎ) టూ (ఇ) మరియు 22 (3) ఆఫ్ ది హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ కింద ఈ నెల 11 నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిషేదజ్ఞలు అమలులో ఉంటాయని సిపి తెలిపారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడడం, ఊరేగింపులు చేయడం నిషేధం. పోలింగ్ కేంద్రాలకు కిలో మీటర్ దూరం వరకు ఆత్మ రక్షణ పేరుతో కర్రలు, తుపాకులు, మారణాయుదాలతో సంచరించడం నిషేధం. బహిరంగ ప్రదేశాలలో షామియానాలు, పందిళ్ల వంటి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడానికి అనుమతి లేదు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆంక్షల సమయంలో మైకులు, స్పీకర్ల ద్వారా పాటలు పెట్టడం, ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేయడం నిషేధం. వ్యక్తులు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్లకార్డులు, చిత్రాలు, గుర్తులు ప్రదర్శించడం చట్టబద్దమైన అధికారానికి భంగం కలిగించే లేదా ధిక్కరించే నేరానికి దారి తీసే అవకాశం ఉన్న ఏదైనా ప్రసంగం నిషేధమని సిపి తెలిపారు.

## వైరా మహిళలకు భగవద్గీత పారాయణం శ్లోకాలు పోటీల్లో గోల్డ్‌మెడల్







**గోల్డ్‌మెడల్ అందుకోనున్న రాయపూడి రజిని, వేముల ఫణికుమార్, దోనెపూడి సునీత**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మహిళలకు భగవద్గీత పారాయణం పోటీల్లో గోల్డ్‌మెడల్ ముగ్గురు మహిళలకు వరించింది. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద దత్తపీఠం ఆశ్రమం వారు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన భగవద్గీత పారాయణం ఆన్‌లైన్ టెలిగ్రామ్ పోటీల నిర్వహణలో 18 అధ్యాయాలు కళ్ళుమూసుకొని ఏ అధ్యయనం అడిగిన దారాళంగా భగవద్గీతలోని శ్లోకాలను కంఠస్థంలముతో చెప్పడంలో వైరాకి చెందిన రాయపూడి రజిని, వేముల ఫణికుమారి, దోనేపూడి సునీత, గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ పోటీల్లో 810 మంది వివిధ దేశాలు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు. అందులో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరాకి చెందిన ముగ్గురు మహిళలు భగవద్గీత అధ్యాయాలను ఎక్కడ అడిగిన అక్కడ టకటక అంటూ దారాళంగా చెప్పడం విజయానికి కారణమయ్యాయి. 25 నిముషాల్లోనే 18 శ్లోకాలను అడిగిన ప్రతిదానికి ఆన్‌లైన్‌లో కళ్ళుమ ఊసుకొని సమాధానాలు చెప్పడ అంటే సామాన్యమైన విషయం కాదు. ఈ నెల17,18,19 తేదీల్లో కర్ణాటకలోని మైసూర్‌లో రాయపూడి వెంకటేష్ సతీమణి రాయపూడి రజిని, వేముల కిషోర్ సతీమణి వేముల ఫణికుమారి, దోనెపూడి సురేందర్ సతీమణి దోనేపూడి సునీత గోల్డ్ మెడల్‌ను అందుకొని ఉన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాకు శిక్షణలో నేర్పిన భగవద్గీతలోని శ్లోకాలను మేము పట్టుదలతో భక్తితో నేర్చుకోవడం జరిగిందన్నారు.

# నేటితో ముగియనున్న ఎన్నికల ప్రచారం

**-సాయంత్రం 5గంటల నుండి మద్యం షాపులు బంద్**



**ప్రజాపక్షం/వైరా:** పార్లమెంటు ఎన్నికల ప్రచార పర్వం నేటి సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది.గత కొన్నిరోజులుగా ప్రచార పర్వంలో బిజెపి కాంగ్రేస్ బిఆర్ఎస్, ఇండిపెంఎడంట్ అభ్యర్థులు జోరుగా ప్రచారాలు కొనసాగించారు. గ్రామాల్లో వార్డుల్లో రాజకీయ పార్టీల నాయకులు ప్రచార పర్వాన్ని కొనసాగించారు. ఈ నెల13న పోలింగ్ జరగనున్న నేపద్యంలో నేటి సాయంత్రం 4గంటలకు ప్రచారం ముగియనుండటంతో మైక్‌లు మూగబోనున్నాయి. ఇప్పటికే ప్రచార పర్వంపై ఎన్నికల కమీషన్ గట్టిగా ఏర్పాటు చేసింది. నేటి సాయంత్రం 5గంటల నుండి మే 13 సాయంత్రం 6గంటల వరకు మద్యం షాపులు పూర్తిగా మూసివేస్తున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనజరగకుండా పోలీసులు మండల కేంద్రాలకు చేరుకున్నారు.

## మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రమాదవశాత్తు మున్నేటిలో పడి మృతి చెందిన ముగ్గురు పిల్లలు గణేష్, హరీష్, లోకేష్ కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని రామచంద్రయ్య నగర్‌లో నివాసం ఉంటున్న వారి ఇండ్లకు వెళ్లి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని పొంగులేటి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు.

## మొక్కజొన్న పంట దగ్ధం

**-రూ.20 లక్షలు నష్టం**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల రెవెన్యూ పరిధిలోని తోట సునీత, రామకృష్ణ, వీరబాబులకు చెందిన మొక్కజొన్న పంటకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పు పెట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కాలి బూడిద కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనితో పాటు పక్కనే ఉన్న మల్బర్ తోట కూడా కాలిపోయింది. మొక్కజొన్న కంకి కలిపి 20 క్వింటాళ్ల వరకు కాలి బూడిదైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం విలువ సుమారు రూ. 20 లక్షల వరకు ఉంటుందని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## సాగర్ జలాలు విడుదల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. నీటి సమస్యను పరిష్కరించేందుకు గాను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా నీటి పారుదల శాఖాధికారులు పాలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. పాలేరు జలాశయం నుంచి దానవాయిగూడెం చెక్‌డ్యాంకు నీరు వస్తున్న క్రమంలో భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికార యంత్రాంగంకు ఆదేశాలు జారీ చేశారు. దీనితో అధికార యంత్రాంగం నీటి పరిష్కారం పై దృష్టి సారించారు. నీరు విడుదల మూలంగా భూ గర్బ జలాలు పెరిగి బోర్లు, బావులకు నీరు చేరనుందన్నారు. ఈ క్రమంలో ఖమ్మం నియోజక వర్గంకు నీటి సమస్య తలెత్తకుండా ఉండే అవకాశం ఉంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**ప్రజాపక్షం/ భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ లో మరోసారి భద్రతా బలగాలు మావోయిస్టు లపై పైచేయి సాధించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరు అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ధృవీకరించారు. మరణించిన మావోయిస్టు మృతదేహాలు కూడా లభ్యమయ్యాయని సమాచారం. డిఆర్జి, ఎస్టిఎఫ్, సిఆర్‌పిఎఫ్ కోబ్రా బెటాలియన్ సహా 1000 మందికి పైగా సిబ్బంది ఈ ప్రాంతాన్ని చుట్టు ముట్టారని బీజాపూర్ ఎస్పి జితేంద్ర యాదవ్ తెలిపారు. ఇప్పుడు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో మావోయిస్టులు బాగా చిక్కుకుపోయినట్లు సమాచారం.

## రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సిపిఐ ప్రచారం



**ప్రజాపక్షం/వైరా:** సిపిఐ, సిపిఎం బలపరిచిన కాంగ్రేస్ పార్టీ ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైరాలో సిపిఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా బస్టాండ్ ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్‌లో పలువురిని కలిసి హస్తం గుర్తుకు ఓటు వేసి రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎర్రబాబు మాట్లాడుతూ మతోన్మాద బిజెపితో దేశానికి రాజ్యాంగానికి పెనుముప్పు ఉందని, ఇండియా కూటమి అభ్యర్థులు గెలిస్తేనే నరేంద్రమోడీని ఇంటికి పంపి రాజ్యాంగాన్ని వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవ్చని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శిమిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్, రామకృష్ణ, కొండా తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

**-ఎన్నికల సాధారణ పరిశీలకులు డా॥ సంజయ్**
**-ఓటరు చైతన్యం కొరకు బైక్ ర్యాలీ**








**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును ఈనెల 13న వినియోగించుకోవాలని ఖమ్మం లోక్‌సభ నియోజక వర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు డా॥ సంజయ్ జి కోల్టే తెలిపారు. శుక్రవారం ఖమ్మం లోక్‌సభ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణ సామి, శంకర నంద్ మిశ్రలతో కలిసి స్వీప్ కార్యాచరణలో భాగంగా ఓటరు చైతన్యం కొరకు సమీకృత కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో చేపట్టిన బైక్ ర్యాలీని నూతన కలెక్టరేట్ వద్ద పరిశీలకులు సంజయ్ జి కోల్టే జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీలో రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్ తో పాటు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె. శ్రీరాం తదితరులు పాల్గొన్నారు. నూతన కలెక్టరేట్ నుంచి శ్రీశ్రీ సర్కిల్, జెడ్పి సర్కిల్, మయూరి సెంటర్, పెవిలియన్ మైదానం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ప్రజాస్వామ్యం ఓటు ప్రాముఖ్యత తెలుపుతూ సాగిన ర్యాలీలో జెడ్పి సెంటర్ వద్ద యువత దేశభక్తి గేయాలు, చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఈనెల 13న పోలింగ్ విషయమై ప్రతి ఒక్కరిని చైతన్యపర్చాలన్నారు.జిల్లాలో పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతుందని తెలిపారు. 96 కోట్ల ఓటర్లు ఉన్న భారతదేశంలో ఎన్నికలు ఎలా జరుగుతాయని ప్రపంచ దేశాల చూపు మనపైనే ఉందన్నారు. ఎన్నికల్లో గెలిచిన వారు పాలకులుగా శాసనాలు చేస్తారని ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తాయని ఓటు వేయకుంటే మనం ప్రశ్నించే హక్కును కోల్పోతామన్నారు. ఖమ్మం జిల్లా చైతన్యవంతమైన జిల్లా అని ఐదేండ్లకు ఒకసారి వచ్చే ఓట్ల పండుగలో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా జరుగుతున్నట్లు దీనిని మేధావులు ఆలోచించాలన్నారు. ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ 96 శాతం పూర్తి చేసినట్లు స్లిప్పులు తీసుకోని వారు తమ ఓటు పోలింగ్ కేంద్రంలో నమోదై ఉంటే చాలని వెళ్లి ఓటు వేయవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బందెల నర్సయ్య మృతి పట్ల సిపిఐ సంతాపం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఏఐటియుసి నాయకులు బందెల నర్సయ్య మృతి పట్ల సిపిఐ ఖమ్మంజిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన ఆయన అనేక ప్రజా పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉన్న నర్సయ్య చిరస్మరణీయుడన్నారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరారవు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్ తదితరులు ఉన్నారు.

**దుర్గాప్రసాద్ మృతికి పువ్వాడ సంతాపం...**

సిపిఐ సీనియర్ నాయకులు కూనవరం ప్రాంత కమ్యూనిస్టు పార్టీ క్రియాశీలక నేత మండా దుర్గా ప్రసాద్ మృతి పట్ల సిపిఐ సీనియర్ నాయకులుపువ్వాడ నాగేశ్వరరావు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కూనవరం ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో మండా దుర్గాప్రసాద్ చురుగ్గా పాల్గొన్నారని ఆయన తెలిపారు. కళాకారునిగా, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా విభిన్న రూపాల్లో దుర్గాప్రసాద్ పేద ప్రజల పక్షాన నిలబడ్డారని ఆయన తెలిపారు. మండా దుర్గా ప్రసాద్ మృతిపట్ల సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు,జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

# పోలింగ్ ముగిసే వరకు సెలెన్స్ పిరియడ్‌గా పాటించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెన్స్ పీరియడ్ గా పాటించాలని ఖమ్మం పార్లమెంటు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలెన్స్ పీరియడ్ లో ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలు లేదని, ఫలితాల వివరాలను వెల్లడించడం, పత్రికల్లో ప్రచురించడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసాయం చేయడం, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం నిషేధించామన్నారు. 48 గంటల పాటు సెలైన్స్ పీరియడ్ లో ఎటువంటి ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వీలు లేదని ఎన్నికలకు సంబంధించి వీడియోలు, పాటలు ప్రదర్శించడానికి వీలు లేదని రాజకీయ నాయకులు పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి అనుచరులు ఎక్కడ ఎలాంటి రాజకీయ ప్రసంగాలు చేయవద్దని, ప్రచారానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రాంతాలకు వెళ్లిపోవాలన్నారు. 48 గంటల పాటు సెలెన్స్ పీరియడ్ లో స్థానికులు మాత్రమే ఉండాలన్నారు. స్థానికేతరులు లాడ్జీలను ఖాళీ చేసి సొంత ప్రాంతాలకు వెళ్లిపోవాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు. రాజకీయ ప్రచారానికి సంబంధించిన బల్క్ మెసేజ్ లు పంపడం నిషేధించామని తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

**సిపి సునీల్ దత్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శాంతియుత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర ఎన్నికల విధులపై సిబ్బందికి పోలీస్ కమిషనర్ దిశా నిర్దేశం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉండడంతో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై పోలీస్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల్లో తమకు కేటాయించిన విధులను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రెండు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రలోభాలకు సంబంధించి ఏమైనా సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రూట్ మొబైల్ పార్టీలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ రోజు ఓటర్లు క్యూ లైనులో ఉండేలా చూసుకోవాలని, నిషేధిత వస్తువులు పోలింగ్ బూత్ లోనికి తీసుకెళ్లకుండా మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల విధి విధానాలు, నియమ నిబంధనలు సంబంధిత చట్టాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి స్థాయిలో ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది కేటాయించిన ప్రాంతాల నుండి వెళ్లకుండా ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డిసిపి నరేష్‌కుమార్, ఏఎస్పి అవినాష్ కుమార్, ఏసిపి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో ఆలసత్వం వహించవద్దు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ఎన్నికల నిర్వహణలో అధికారులు అలసత్వం వహించవద్దని తహశీల్దార్ కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీన పోలింగ్ ఉదయం 7గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతుందని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలను మూసివేయాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై నిఘా ఉంచాలన్నారు. మద్యం, డబ్బు పంపిణీ చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను ఖమ్మంలోని శ్రీచైతన్య ఇనిస్టూట్ కళాశాలకు తరలించాలన్నారు.

# నామను పార్లమెంట్‌కు పంపిద్దాం

**ప్రజాపక్షం/ చింతకాని :** పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావుకు ఓటు వేసి గెలిపించాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్, చింతకాని సొసైటీ డైరెక్టర్ నన్నక కోటయ్య పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చింతకాని మండలంలోని నేరెడ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచిన్నతండాలను గ్రామాలుగా మార్చి వారి గ్రామాలను వారే పాలించుకునే విధంగా వెసులుబాటు కల్పించిన ఘనత కేసిఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి చెందిందన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి నామాను గెలిపించి కేసిఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ప్రసాద్, బుచ్చాలు, మనం మరియన్న, డి.వెంకన్న, ఎ.ప్రసాద్, మట్టా సైదా తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద శక్తులను ఓడిద్దాం

**సిపిఐ వైరా నియోజకవర్గ కార్యదర్శి యర్రా బాబు**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మతోన్మాద శక్తులను ఓడించి వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిరామసహాయం రఘురాంరెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని వైరా నియోజక వర్గ కార్యదర్శియర్రా బాబు పిలుపునిచ్చారు. ఏన్కూరులో స్థానిక ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశంలో బిజెపి మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తూ ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ దేశంలో అలజడి సృష్టిస్తూ వస్తుందన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతూ ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగాన్నిపూర్తిగా నిర్వీర్యం చేస్తూ పేద ప్రజల హక్కులను పూర్తిగా విస్మరిస్తూ వచ్చిందన్నారు. సబ్సిడీలను రద్దు చేస్తూ దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెడుతుందన్నారు. మరోసారి బిజెపికి అవకాశం ఇస్తే దేశంలో రిజర్వేషన్‌లను రద్దు చేస్తుందన్నారు. అందుకే వామపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శిజాగర్లమూడి రంజిత్‌కుమార్, జిల్లా సమితి సభ్యులు అమరనేని వీరభద్రం, సీనియర్ నాయకులు మేడా భూషయ్య, గ్రామ కార్యదర్శి మాదినేని వెంకన్న, నగదర్‌రావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పివిరావు జయంతి

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేని మండలంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు పోతుల విశ్వేశ్వరరావు 75వ పుట్టినరోజుసందర్భంగా సింగరేని మండలం మాలమహానాడు మండల అధ్యక్షులు సోమందుల రాములవారి నాయకత్వంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద పివి.రావు జయంతిని ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహానాడు నాయకులు తలారి చంద్రప్రకాష్ మాట్లాడుతూ పివి.రావు ఆనాటి ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్ అంటూ ఎస్సీలను విడదీసే ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. ఆ రిజర్వేషన్లు వద్దంటూ రిజర్వేషన్ పేర్లతో దళిత కుటుంబాలను విడతీయద్దంటూ దళితులందూ కలిసే ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వారందరూ కలిసి ఉంటే రాజ్యాధికారం వస్తుందని రాజ్యాధికారాన్ని రాకుండా ఆనాటిప్రభుత్వాలు కుట్ర చేయడం జరిగిందన్నారు. మాల మహానాడు వ్యవస్థను స్థాపించి తన కుటుంబాన్ని సైతంజాతికి అంకితం చేసిన గొప్ప మహనీయుడు అంటూ వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ ఆయన చేసిన పోరాటాన్ని మనం కూడా చేయాలంటూ చంద్రప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు గ్రామశాఖ నాయకులు కొక్కిలి యుగంధర్, చెవుల శ్రీనివాసరావు, సోమందుల నాగరాజు, తోట మల్లసాయి , చెవుల చందు, సోమందుల వెంకటేశ్వర్లు, తడికమళ్ళ నారేష్, సోమందుల రఘుబాబు, మైసా అనిల్ తదితరులు పాల్గొన్నారు.